వరద బాధితులకు ఉదారంగా సాయం

ప్రజాశక్తి-విజయనగరం

భారీ వర్షాలు, వరదల కారణంగా ఇబ్బందులకు గురవుతున్న ప్రజానీకానికి మానవతా దృక్పథంతో ఉదారంగా సహాయం అందించాలని సిఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో భారీ వర్షాలు వల్ల ఉత్పన్నమైన పరిస్థితులపై సిఎం శుక్రవారం జిల్లా కలెక్టర్ లు, ఎస్‌పిలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పునరావాస కేంద్రాలకు తరలించిన వారికి మంచి ఆహారాన్ని, వసతులను కల్పించాలని కోరారు. పునరావాస కేంద్రాల నుంచి తిరిగి ఇంటికి వెళ్లే వారికి ఒక్కో కుటుంబానికి రూ.2వేల నగదు సహాయం అందించాలని సూచించారు. పూరి గుడిసెలు దెబ్బతిన్నప్పుడు సహాయంగా రూ.10 వేలు అందించాలని ఆదేశించారు. సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి ఎస్, ఎస్‌పి దీపిక, డిఆర్‌ఒ ఎం. గణపతిరావు, ఆర్‌డిఒ సూర్యకళ, సిపిఒ పి.బాలాజీ, డిఎంహెచ్‌ఒ డాక్టర్ భాస్కరరావు, జిల్లా వ్యవసాయ అధికారి విటి రామారావు, ప్రకృతి విపత్తుల నిర్వహణ జిల్లా మేనేజర్ బిఎస్.దొర పాల్గొన్నారు.

సొంతగూటికి మెడికల్ కాలేజి

- 1న ప్రిన్సిపల్ ఛాంబర్ తరలింపు
- కౌన్సిలింగ్ పూర్తికాగానే బోధనా విభాగం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

త్వరలో మెడికల్ కాలేజీ సొంతగూటికి చేరనుంది. ఆగస్టు 1 లేదా 2వ తేదీల్లో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఛాంబర్‌ను తరలించనున్నారు. కౌన్సిలింగ్ పూర్తికాగానే బోధనా సిబ్బంది కూడా అక్కడే కొలువుదీరనున్నారు. ఈలోపు పనులన్నీ పూర్తిచేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వైద్యవిధాన పరిషత్ ఆధ్వర్యాన నడిచిన జిల్లా కేంద్రాసుపత్రి, ఘోషాసుపత్రులను ప్రభుత్వ మెడికల్ కాలేజీకి క్లీనికల్ ఆసుపత్రిగా అనుసంధానం చేసిన విషయం విధితమే. ఈనేపథ్యంలో ప్రిన్సిపాల్ ఛాంబర్ కూడా ప్రస్తుతం సర్వజన ఆసుపత్రిలోనే ఉంది. ఈ ఏడాది ఎంబిబిఎస్ మొదటి సంవత్సరం అడ్మిషన్లకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసిన నేపథ్యంలో నూతనంగా నిర్మిస్తున్న భవన సముదాయంలో అందుకు అవసరమైన వసతులను కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఎంబిబిఎస్ మొదటి సంవత్సరానికి 150సీట్లు కూడా మంజూరయ్యాయి. ఈనెల 26 నుంచి ఆలిండియా అడ్మిషన్లు జరుగుతున్నాయి. త్వరలో స్టేట్ లెవెల్ అడ్మిషన్లు కూడా ప్రారంభం కానున్నాయి. ఈలోపు అనాటమీ, ఫిజియాలజీ, బయో కెమిస్ట్రీ, కమ్యూనిటివ్ మెడిసిన్ వంటి నాలుగు విభాగాలు పూర్తి స్థాయిలో ఏర్పాటు కానున్నాయి. బోధన సిబ్బంది, తరగతి గదులు, విద్యార్థులకు వసతి, లేబొరేటరీ తదితర సదుపాయాలు కల్పించేందుకు యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టారు. వారం రోజుల్లో నూతన భవనంలోకి అడుగు పెట్టాలని స్థానిక ప్రిన్సిపాల్‌కు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు కూడా అందాయి. మొత్తంగా మెడికల్ కాలేజీ సముదాయం నిర్మాణానికి గాజులరేగకు సమీపంలోగల 80ఎకరాల స్థలాన్ని కేటాయించిన సంగతి తెలిసిందే. ఇందుకు రూ.500కోట్ల నాబార్డు నిధులు మంజూరయ్యాయి. యుద్ధ ప్రాతిపదికన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. తాత్కాలిక భవనాలు కొలిక్కివచ్చాయి. ఎంబిబిఎస్ పూర్తిస్థాయిలో అందుబాటులో వచ్చేసరికి మెడికల్ కాలేజీలో 22 విభాగాలు అందుబాటులోకి రానున్నాయి.



చివరి దశకు చేరుకున్న మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు

కొత్త వైద్య కళాశాలల్లో 50శాతం సీట్లు విక్రయానికి పెడుతూ వైద్యారోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎంటి కృష్ణబాబు ఇటీవల ఉత్తర్వులు ఆశావహుల్లో నిరాశ వ్యక్తమౌతోంది. మెడికల్ కాలేజీకి కేటాయించిన 150సీట్లలో 15శాతం సీట్లను ఆలిండియా కోటాలో కేటాయిస్తారు. మిగిలిన సీట్లలో 128 లేదా 129సీట్లలో 50శాతం సీట్లు మాత్రమే ప్రభుత్వ కోటా కింద కేటాయిస్తారు. మిగిలిన 50శాతంలో 35శాతం సెల్ఫ్‌ఫైనాన్స్ కింద, 15శాతం ఎన్ఆర్ఐ కోటా కింద కేటాయిస్తారు. దీన్నిబట్టి ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడినవారికి 64 లేదా 65సీట్లకు మించి వచ్చే అవకాశం లేదు. సెల్ఫ్ ఫైనాన్స్ కోటా సీట్లను 12లక్షలకు, ఎన్ఆర్ఐ కోటా సీట్లకు రూ.20లక్షల చొప్పున ఫీజు విధించారు. దీంతో, వైద్య వృత్తిచేయాలని కలలు కంటున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమౌతోంది. కళాశాల మొత్తానికి 222 మంది ప్రొఫెసర్ పోస్టులు మంజూరు కాగా, ఇప్పటి వరకు సుమారు 192పోస్టులు మాత్రమే భర్తీ అయ్యాయి. భర్తీ కావాల్సిన 30పోస్టుల్లో కొన్ని రాష్ట్ర కేంద్రం, మరికొన్ని రీజనల్, ఇంకొన్ని కళాశాల స్థాయిలో భర్తీ చేయాల్సి వుంది.

మండలానికి రూ.60లక్షలు

రోడ్లు, కాలువల అభివృద్ధికి

- సగంలో నిలిచిపోయిన పనులకు ప్రాధాన్యత
- 31 లోగా ట్రైబల్ యూనివర్సిటీ

ల్యాండ్ మ్యుటేషన్ జరగాలి : మంత్రి బొత్స

ప్రజాశక్తి-విజయనగరం

ఉపాధి హామీ నిధులతో బిటి రోడ్లు, సిసి రోడ్లు, డ్రైనేజిల అభివృద్ధి చేయడానికి ప్రతి మండలానికి రూ.60 లక్షలు మంజూరు అయినట్లు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. ఈ నిధులతో ఇదివరకే చేపట్టి నిధులు సరిపడక ఆగిపోయిన పనులను ముందుగా చేపట్టాలని తెలిపారు. అటువంటి పనులు పెండింగ్ లేని చోట కొత్త పనులకు ప్రతిపాదనలు పంపాలని అన్నారు. ఇప్పటికే ఎస్.కోట, రాజాం తప్ప అన్ని నియోజక వర్గాల నుండి 60 లక్షలకు సంబంధించిన ప్రతిపాదనలు అందాయని కలెక్టర్ తెలుపగా అందరి ఎమ్మెల్యేలతో మంత్రి ఫోన్ ద్వారా మాట్లాడి పెండింగ్ పనులు ముందు పూర్తి చేయాలని, మిగిలిన నిధులకు కొత్త పనులకు ప్రతిపాదనలు పంపాలని తెలిపారు.

శుక్రవారం కలెక్టర్ ఛాంబర్ లో మంత్రి జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తో కలసి పంచాయతీ రాజ్ పనులు, భారీ వర్షాలు, గిరిజన యూనివర్శిటీ పనుల పై సమీక్షించారు. ఉపాధి హామీ నిధులతో చేపట్టే రూ.60 లక్షలతో పనులను వెంటనే మంజూరు అయ్యేలా చూడాలని డ్వామా పీడీకి సూచించారు. ట్రైబల్ యునివర్సిటీ కి సంబంధించి 519 ఎకరాలు మ్యుటేషన్ జరగవలసి ఉందని, మ్యుటేషన్ జరిగితే గానీ తదుపరి నిర్మాణ పనులు ప్రరంభించలేమని డీన్ శ్రీనివాస రావు తెలుపగా సోమవారం లోగా మ్యుటేషన్ పూర్తి చేయాలని కలెక్టర్‌కు మంత్రి తెలిపారు. యూనివర్సిటీకి అప్రోచ్ రోడ్ కోసం ప్రతిపాదనలు పంపించగా ఇఎన్‌సి వద్ద పెండింగ్ ఉందని కలెక్టర్ తెలిపారు. మంత్రి పంచాయతీ రాజ్ సెక్రటరీతో ఫోన్ లో మాట్లాడి త్వరగా మంజూరు చేయాలని కోరారు. త్వరలో ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారని, యూనివర్సిటీ పనులకు అత్యంత ప్రాధాన్యత నివ్వాలని మంత్రి అధికారులకు సూచించారు. విద్యుత్ సరఫరా, నీటి సరఫరా, పైప్ లైనింగ్ తదితర పనులు వేగంగా జరగాలని ఆయా శాఖల అధికారులకు ఆదేశించారు.

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట నష్టం గానీ, జన నష్టం గానీ, ఇరిగేషన్ ట్యాంక్ ల గండ్లు గానీ జరిగాయా అని సంబంధిత అధికారులను మంత్రి అడిగారు. సాధారణ వర్షపాతం కంటే 36 శాతం అధికంగా నమోదు అయ్యిందని, అయితే జిల్లాలో ఎక్కడా ఎలాంటి నష్టం వాటిల్లలేదని కలెక్టర్ తెలిపారు. వర్షాలకు చెరువులన్నీ నిండి ఉన్నందున గండ్లు పడే అవకాశం ఉంటుందని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సమావేశంలో రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, డిఆర్‌ఒ గణపతి రావు, సిపిఒ బాలాజీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇలు గుప్తా, ఉమా శంకర్, డ్వామా పీడీ ఉమా పరమేశ్వరి, విద్యుత్ శాఖ ఎస్ఇ లక్ష్మణ రావు, వ్యవసాయాధికారి తారక రామారావు, ఆర్ అండ్‌బి ఇఇ వెంకట రమణ, తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్ససత్యనారాయణ

చదరంగం పోటీల్లో పాల్గొన్నచిన్నారులు

హోరా హోరీగా రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంధ్ర చెస్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న స్టేట్ టీం ఫిడే రేటింగ్ చెస్ ఛాంపియన్ షిప్ పోటీలు టిటిడి కల్యాణ మండపంలో హోరాహోరీగా సాగుతున్నాయి. ఈ పోటీలను ఇన్‌స్పైర్ స్కూల్ ప్రిన్సిపాల్ రవి, డాక్టర్ బిసెంట్ స్కూల్ డైరెక్టర్ వింధ్య లాంఛనంగా ప్రారంభించారు ఈ పోటీల్లో విశాఖపట్టణం నుండి అఖిల్ ప్రసాద్ వెంకట రుత్విక్, కృష్ణా జిల్లా నుండి కొల్లా భవన్, తూర్పుగోదావరి జిల్లా నుండి భాస్కర్ రత్న, షణ్ముఖ రెడ్డి క్రీడాకారులు ముందంజలో కొనసాగుతున్నారు. పోటీలు మరో రెండు రోజులపాటు జరగనున్నాయి సీనియర్ క్రీడాకారులకు ప్రస్తుత క్రీడాకారులు సైతం గట్టి పోటీ ఇవ్వడంతో ఈ పోటీలు రసవత్తరంగా మారాయి. ఈ పోటీలను రాష్ట్ర కార్యదర్శి సనపల భీమారావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు మస్తాన్ బాబు, రాష్ట్ర కోశాధికారి జ్వాలాముఖి పర్యవేక్షిస్తున్నారు ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఇంటర్నేషనల్ ఆర్బిటర్ జివి కుమార్ వ్యవహరిస్తున్నారు.

ఇంటింటి సర్వే జాప్యంపై కలెక్టర్ ఆగ్రహం

ప్రజాశక్తి-విజయనగరం

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా జిల్లాలో చేపట్టిన ఇంటింటి సర్వే నెమ్మదిగా జరుగుతుండటం పట్ల కలెక్టర్ నాగలక్ష్మి తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. మందకొడిగా జరుగుతున్న మండలాల అధికారులపై మండిపడ్డారు. పనితీరు మార్చుకొని, వేగవంతం చేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్‌డిఒలు, తాహశీల్దార్లు, ఎన్నికల డిటిలతో కలెక్టర్ సమీక్షించారు. నియోజకవర్గాల వారీగా, మండలాల వారీగా చేపట్టిన జాబితాల సవరణ ప్రక్రియను తెలుసుకున్నారు. ఇంటింటి సర్వే ప్రారంభమై దాదాపు వారం రోజులు కావస్తున్నా, కనీసం పదిశాతం కూడా పూర్తి కాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో సుమారు 5,17,000 ఇళ్లు ఉండగా, ఇప్పటివరకు కేవలం 38,000 ఇళ్ల సర్వే మాత్రమే పూర్తి చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా అయితే శతశాతం ఎప్పుడు పూర్తి అవుతుందని ప్రశ్నించారు. వచ్చే వారం చివరికి 50 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. కొత్త ఓటర్లు, జనవరి 2024 నాటికి ఓటుహక్కు పొందే ఓటర్ల వివరాలు కూడా చాలా తక్కువ సేకరించారని అన్నారు. డెత్ ఓటర్స్ వెరిఫికేషన్, వందేళ్లు పైబడిన ఓటర్ల వివరాల తనిఖీ కూడా అంతంత మాత్రంగా ఉందన్నారు. సర్వేలో 6,7,8 ఫారాల స్వీకరణ పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. పనితీరు మారాలని, నిర్లిప్తతను విడనాడాలని సూచించారు. సవరణ ప్రక్రియపై తాహశీల్దార్లు, ఆర్‌డిఒలు ప్రతిరోజూ బిఎల్‌ఒలతో సమీక్ష చేయాలని ఆదేశించారు. ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. కాన్ఫరెన్స్‌లో డిఆర్‌ఓ ఎం.గణపతిరావు, ఇఆర్‌ఓలు, ఎఇఆర్‌ఒలు, జిల్లా ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన కలెక్టర్

మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్

డెంకాడ : ఐఎఎస్‌ల సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి స్థానిక బేతనాపల్లి వద్ద రిజర్వు ఫారెస్టు స్థలంలో మొక్కలు నాటారు. జిల్లా అటవీశాఖ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బేతనాపల్లి గ్రామస్తులు, తమకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. అటవీభూమిలో ఇళ్ల పట్టాలు ఇవ్వడం సాధ్యం కాదని, ఇతర ప్రత్యామ్నాయ స్థలాలను చూస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. నగరవనం పథకంలో భాగంగా చేపట్టిన ఈ మొక్కలు నాటే కార్యక్రమంలో జిల్లా అటవీశాఖాధికారి ఎస్.వెంకటేష్, డ్వామా పీడీ జి.ఉమాపరమేశ్వరి, తాశిల్దార్ ఆదిలక్ష్మి, ఎఫ్ఆర్‌ఒలు బి.అప్పలరాజు, ఆర్.రాజాబాబు, వివిఎస్ఎన్ రాజు, పివి సింధు, ఉపాధిహామీ ఎపిఒ వెంకటరమణ, ఎఫ్ఎస్ఒలు, బీట్ అధికారులు, ఉపాధిహామీ సిబ్బంది, వేతనదారులు పాల్గొన్నారు.

ఆర్‌జెడి కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఎంఇఒపై చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం తగదు

ఆర్‌జెడి కార్యాలయం వద్ద యుటిఎఫ్ ధర్నా

ప్రజాశక్తి-విశాఖపట్నం

కొత్తవలస మండల విద్యాశాఖ కార్యాలయంలో సర్వీస్ రిజిస్టర్ పోయిందని చెప్పిన ఉపాధ్యాయుడు ఇ.సోల్‌రాజును వేధించడంతో పాటు తప్పుడు ఫిర్యాదులు చేసిన ఎంఇఒపై చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం చేయడం దుర్మార్గమని యుటిఎఫ్ నాయకులు అన్నారు. శుక్రవారం మధురవాడ ఆర్‌జెడి కార్యాలయం వద్ద యుటిఎఫ్ విజయనగరం జిల్లాశాఖ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకులు మాట్లాడుతూ ఉన్నతాధికారుల విచారణలో తొమ్మిది అంశాలకుగాను ఐదింటిలో పూర్తిగాను, ఒకదాంట్లో పాక్షికంగా ఎంఇఒ తప్పు చేశారని నిర్ధారించినప్పటికీ, నామమాత్రపు చర్యలతో చేతులు దులుపుకోవడం సిసిఎ నిబంధనలకు విరుద్ధమని అన్నారు. దీనిపై పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించనందువల్లే ఆర్‌జెడి కార్యాలయం వద్ద ధర్నా చేశామన్నారు. ఆర్‌జెడి వచ్చి చర్యలపై స్పష్టత ఇచ్చేంతవరకు దీక్ష విరమించేది లేదని భీష్మించారు. అనంతరం ధర్నా శిబిరానికి ఆర్‌జెడి కార్యాలయం ఇన్‌ఛార్జి ఎడి శ్రీరామమూర్తి వచ్చి, కొత్తవలస ఎంఇఒపై వచ్చిన ఫోర్జరీ సంతకం, ఇతరత్రా అభియోగాలు, ఉపాధ్యాయుడిని వేధించడం వంటి చర్యలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు, విజయనగరం, అనకాపల్లి, విశాఖ జిల్లాల ప్రధాన కార్యదర్శులు ఈశ్వరరావు, జి.చిన్నబ్బాయి, టిఆర్ అంబేద్కర్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు కె విజయగౌరి, డి.రాము, రాష్ట్ర కౌన్సిలర్ కె .అప్పారావు, జిల్లా కార్యదర్శులు కె.ప్రసాదరావు, పి.త్రినాథ్, పి.వాసుదేవరావు, తిరుపతినాయుడు, జివి రమణ, సిపిఎస్ జిల్లా కన్వీనర్ పి రాంప్రసాద్, పలు మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు మంత్రి బొత్స పర్యటన

మెరక ముడిదాం :రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ శనివారం మండలంలో పర్యటించనున్నట్లు ఎంపిడిఒ ఎం. రత్నం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గొల్లల వలస గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో మంత్రి బొత్సతో పాటు జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపి బెల్లాన చంద్ర శేఖర్, ఎంపిపి తాడ్డి క్రిష్ణ వేణి పాల్గొంటారని ఆమె తెలిపారు.

చిరంజీవి, వెంకటరావుకు అబ్దుల్ కలాం యూత్ అవార్డులు

అవార్డు అందుకుంటున్న గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షులు గెద్ద చిరంజీవి

ప్రజాశక్తి-విజయనగరం రూరల్

విజయనగరానికి చెందిన ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల చేస్తున్న స్వచ్ఛంద సామాజిక కార్యక్రమాలకు గుర్తింపుగాను జిల్లా అధ్యక్షులు గెద్ద చిరంజీవికి, గ్రామ అభివృద్ధితో పాటు, సామాజికసేవా కార్యక్రమాలు చేసి యువకులకు స్ఫూర్తిగా నిలిచినందుకు గుంకలాం సర్పంచ్ కునుకు వెంకటరావు (నాగరాజు)కు అబ్దుల్ కలాం యూత్ అవార్డులు లభించాయి. మధురై ఇంటర్నేషనల్ యునైటెడ్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో వై 20 యూత్ అవార్డు కార్యక్రమం మదురై జెయస్ ఫంక్షన్ హాలులో జరిగింది. ఈ సందర్భంగా వీరికి తమిళనాడు మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యులు అయ్యప్పన్, వై20 ఇండియా చైర్‌పర్సన్ అల్మోల్ సోవియట్ , నైజీరియా గవర్నర్ సైకత్ రోయల్, ఇంటర్నేషనల్ యునైటెడ్ కలాం ఫౌండేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ సెంచూర్ పాండ్యన్, యూత్ అఫైర్స్ స్టేట్ కమీషనర్ అభిషేక్ అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో కలామ్ ఫౌండేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు మమ్ముల తిరుపతిరావు , కార్యదర్శి జంగం జోషీ, ఉమాశంకర్ మహంతి ప్రభాకర్ రావు పాల్గొన్నారు.

అవార్డు అందుకుంటున గుంకలాం సర్పంచ్ వెంకటరావు

ఆలోచనాత్మక ప్రాజెక్టులు నమోదు చేయండి

జిల్లా విద్యా శాఖ అధికారి లింగేశ్వర రెడ్డి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆలోచనాత్మకమైన ప్రాజెక్టులు నమోదు చేయాలని సైన్సు ఉపాధ్యాయులకు డిఇఒ బి.లింగేశ్వరరెడ్డిసూచించారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల నుంచి మూడు లేదా ఐదు ప్రాజెక్టులు చొప్పున ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు. శుక్రవారం గురజాడ పాఠశాలలో విజయనగరం డివిజన్ సైన్స్ ఉపాధ్యాయులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్‌స్పైర్ అవార్డులకు గాను విద్యార్థికి రూ.10 వేలు మంజూరు చేస్తారని తెలిపారు. ఆగష్టు 15 లోగా జిల్లాలోని అన్ని పాఠశాలలూ ఐదు ప్రాజెక్టులు నమోదు తప్పని సరని తెలిపారు. శాస్త్ర, సాంకేతిక అభివృద్ధి పరమైన అంశాలను ఉపాధ్యాయులు విద్యార్థులు అందించాలన్నారు. శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందింపజేయాలని సూచించారు. సదస్సులో జిల్లా ఉప ఉద్యాశాఖాధికారి వాసుదేవరావు, జిల్లా సైన్స్ అధికారి మిరియాల కృష్ణారావు, టి.రాజేష్, కవి. సత్యారావు, గోపాలరావు, భాను ప్రకాశ్ తదితరులు సూచనలు, సలహాలు అందించారు.

ఎపి జిసి ఆధ్వర్యంలో పాఠశాలల్లో లైఫ్ కార్యక్రమాలు

భారత దేశానికి స్వాతంత్ర్య వచ్చి 75 సం వత్సరాలు పూర్తయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో మొదలైన మిషన్ లైఫ్ (లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్) అనే పర్యావరణ కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని పాఠశాలలు అమలు చేయాలని జిల్లా విద్యా శాఖాధికారి బి.లింగేశ్వరరెడ్డి ఆదేశించారు. శుక్రవారం స్థానిక గురజాడ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎపిజిసి వారు పాఠశాలలకు పంపిన లైఫ్ బ్యానర్‌ను ఆవిష్కరించి అన్ని పాఠశాలలకు అందించాలని ఆదేశించారు.

నేడు సీతం కళాశాలలో ప్రాంగణ నియామకాలు

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ప్రాంగణ నియామకాలు జరగనున్నాయని కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషన్‌రావు శుక్రవారం తెలిపారు. టెక్ తమ్మినా, డబ్ల్యుఎన్ఎస్ గ్లోబల్ సర్వీసెస్ కంపెనీలు ఈ ప్రాంగణ నియామకాలు చేపడతాయని తెలిపారు. ఈ నియామకాలకు ఏదైనా డిగ్రీ అర్హత కలిగిన ఆసక్తి ఉన్న విద్యార్థులు హాజరు కావాలని కోరారు. నియామకాలు శనివారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం వరకు జరుగుతాయన్నారు. సహాయం కొరకు 94949 06561, 7981444642, 8328550367 నంబర్ లకు సంప్రదించాలని తెలిపారు.

క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కరించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరం

క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి, పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఎస్‌పి ఎం.దీపిక ఆదేశించారు. శుక్రవారం జిల్లాపోలీసు కార్యాలయంలో నేర సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రతీ పోలీసు అధికారి విధిగా గ్రామ సందర్శనలు చేయాలని, క్షేత్ర స్థాయిలో సమస్యలను గుర్తించి, ప్రాథమిక స్థాయిలో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. స్టేషను పరిధిలోని గ్రామాలను, వార్డులను ప్రస్తుత పరిస్థితులను బట్టి సమస్యాత్మక, అతి సమస్యాత్మక, సాధారణ గ్రామాలుగా విభజించి, ఆయా గ్రామాలను, వార్డులను సంబంధిత సిబ్బందికి దత్తతగా అప్పగించాలని అన్నారు. అనంతరం, వివిధ పోలీసు స్టేషన్లలో నమోదైన కేసులను సమీక్షించి, దర్యాప్తు పెండింగులో ఉండేందుకుకారణాలను అధికారులను అడిగి తెలుసుకొని, దర్యాప్తు పూర్తి చేయాలన్నారు. గంజాయి అక్రమ రవాణ నియంత్రణలో భాగంగా విస్తృత తనిఖీలు చేపట్టి, అక్రమ రవాణ దారులపై మూడు కేసులు నమోదు చేసి, భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్న ఎస్.కోట ఎస్ఐ జి.లోవరాజును ఈ సందర్భంగా అభినందించారు. 'బెస్ట్ పెర్ఫార్మర్' గా ఎంపిక చేసి, జ్ఞాపికను ప్రదానం చేశారు.అదనపు ఎస్‌పి అస్మా ఫర్హీన్, డిఎస్‌పిలు ఆర్.శ్రీనివాసరావు, ఎఎస్ చక్రవర్తి, ఆర్.గోవిందరావు, పి.శ్రీధర్, వీరకుమార్, ఎల్.శేషాద్రి, సిఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి ఎం.దీపిక

కొనసాగిన విద్యుత్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వేతన ఒప్పందాన్ని సవరించాలని, ఒప్పంద కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ విద్యుత్తు ఉద్యోగులు జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన ఆందోళనలు రెండోరోజు శుక్రవారం కూడా జరిగాయి. విద్యుత్ భవన్ వద్ద భోజన విరామం సమయంలో ఉద్యోగులు నిరసన తెలిపారు. రాష్ట్ర విద్యుత్తు ఉద్యోగుల ఐకాస చైర్మన్ డి.రాజేంద్రప్రసాద్ ,కన్వీనర్ బి.రోజకుమర్, డిస్కం ఉపాధ్యక్షులు పి.త్రినాథ్ రావు మాట్లాడుతూ సంస్థలో పనిచేస్తున్న ఒప్పంద కార్మికులకు కనీస వేత నాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 1999 ఫిబ్రవరి 1 నుంచి 2004 ఆగస్టు 31 మధ్య కాలంలో నియమితులైన ఉద్యోగులకు జిపిఎఫ్ సహా పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. విధి నిర్వహణలో ప్రమాదానికి గురై మృతి చెందిన ఎనర్జీ అసిస్టెంట్ల కుటుంబ సభ్యులకు కారుణ్యా నియామకాల కింద ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. 2022 జనవరి డిఎ బకాయిలతో పాటు పెండింగ్ బకాయిలను విడు దల చేయాలని, ఏకసభ్య కమిషన్ పిఆర్‌సి నివేదికను పక్కన పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉద్యోగులు, జెఎసి నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 39వ డివిజన్ గౌతమి నగర్, అలకానందకాలనీ ప్రాంతాలలో నూతనంగా ఏర్పాటు చేయనున్న రహదారుల నిర్మాణ పనులకు శుక్రవారం మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జోనల్ ఇన్‌ఛార్జి డాక్టర్ వివిఎస్ ప్రసాద్ మాట్లాడుతూ నగరంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి నేతత్వంలో అభివద్ధి శరవేగంగా సాగుతుందన్నారు. కానీ ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ లేనిపోని విమర్శలు చేస్తూ అడ్డు తగులుతుందని ఆరోపించారు. కార్పొరేటర్ వింత ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ గౌతమి నగర్,అలకానంద కాలనీ వంటి శివారు కాలనీలలో గత 30 ఏళ్లుగా జరిగని అభివృద్ధి ప్రస్తుతం జరుగుతుందన్నారు. ప్రతిచోట రహదారులు, కాలువలు నిర్మించి కాలనీలకి కొత్త అందాలను తీసుకొస్తున్న ఘనత కోలగట్లకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ లయ యాదవ్, దాసరి సత్యవతి, పిన్నింటి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల చర్చలు సఫలం

రామభద్రపురం: గత 25 రోజులుగా స్థానిక మేజర్ పంచాయతీ పారిశుధ్య కార్మికులు వారి వేతన, తదితర సమస్యలపై చేస్తున్న సమ్మె పై శుక్రవారం చర్చలు జరిపారు. సిబిటియు సమ్మెకు సంఘీభావం ప్రకటించడంతో పాటు వారికి అండగా నిలవడంతో స్పందించిన యంత్రాంగం వారితో చర్చించింది. అధికార యంత్రాంగం వీరి వేతన సవరణకు అంగీకరించి 14 మంది కార్మికులలో ఏడుగురికి రూ.9 వేలు, మిగతా వారికి రూ.7,200 చొప్పున వేతనాలు ఇవ్వడానికి అంగీకరించడంతో సమ్మె విరమించేందుకు కార్మికులు, సిబిటియు నేతలు అంగీకరించారు. ఈ సందర్భంగా సిబిటియు జిల్లా కార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ వర్షా కాలం కావడంతో సమ్మె ప్రభావం ప్రజల ఆరోగ్యాలపై చూపుతుందనే ఉద్దేశంతో సమ్మె విరమణకు ప్రాధాన్యత ఇచ్చామని అన్నారు. ఈ చర్చల్లో అధికార యంత్రాంగం, పాలక వర్గం, సిబిటియు నాయకులు బలస శ్రీను, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు జయప్రదం చేయాలి

నెల్లిమర్ల: వచ్చే నెల 21, 22 తేదీల్లో విజయవాడలో జరగనున్న ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు జె. మురళి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఎన్‌జిఒ నెల్లిమర్ల తాలూకా యూనిట్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌన్సిల్ సమావేశాలకు సిఎం జగన్మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఉద్యోగుల్లో ఐక్యతను పెంపొందించేలా నెల్లిమర్ల తాలూకా యూనిట్ నుంచి అధిక సంఖ్యలో సమావేశానికి హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కోశాధికారి ఎస్.వి. సుధాకర్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ వై.ఆనంద్ కుమార్, జిల్లా జాయింట్ సెక్రెటరీ జివిఎస్ఎస్ మూర్తి, స్థానిక నెల్లిమర్ల కోశాధికారి ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పర్యావరణ పరిరక్షణ దినోత్సవం

శృంగవరపుకోట: పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఆర్‌టిసి డిపో ఆవరణలో శుక్రవారం స్నేహ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 25 కొబ్బరి, సపోటా, ఉసిరి, మామిడి, జామ, వివిధ రకాలైన మొక్కలను డిపో మేనేజర్ కె. రమేష్ ఆధ్వర్యంలో నాటారు. ఈ కార్యక్రమం విస్సకోట శ్రీరామ్ మూర్తి ఆర్థిక సౌజన్యంతో నిర్వహించినట్లు స్నేహ సంస్థ కార్యదర్శి మంద సుబ్బారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్నేహ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు డాక్టర్ పొట్నూరు వరలక్ష్మి, మల్ల రామకృష్ణ, ఎం.ప్రకాష్, వి. మురళి, వి.రాము, హరిష్,వి.రమేష్, ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు, జి. లక్ష్మణరావు, ఆర్‌టిసి ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

బొబ్బిలి: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని రోటరీ క్లబ్ అధ్యక్షులు జెసి రాజు, కార్యదర్శి వారణాసి శ్రీహరి కోరారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా శుక్రవారం పట్టణంలో మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించేందుకు మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు.

అర్చకుల సమస్యలు పరిష్కరించిన సిఎం

నెల్లిమర్ల: దేవాలయాల అర్చకుల సమస్యలు సిఎం జగన్మోహన్‌రెడ్డి పరిష్కరించారని అర్చక సమాఖ్య జిల్లా శాఖ అధ్యక్షులు ఖండవిల్లి సాయి రామాచార్యులు తెలిపారు. శుక్రవారం మండలంలోని రామతీర్థం దేవస్థాన ఆవరణలో అర్చక సమాఖ్య ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంజగన్మోహన్ రెడ్డి ఎన్నికల వాగ్దానాలలో అర్చకులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వగా దీనిలో భాగంగా సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి సంవత్సరానికి రూ.5 లక్షల ఆదాయం వస్తున్న దేవాలయాలను అర్చకులకు అప్పగిస్తూ జిఓ విడుదల చేసారని గుర్తు చేశారు. భూములున్న అర్చకులకు రైతు భరోసాలో అవకాశం కల్పించినట్టు తెలిపారు.

లక్ష్మిపేట కేసు వాయిదా

వంగర: మండలంలోని లక్ష్మిపేటలో ఐదుగురు దళితులను అగ్రకుల భూస్వాములు హత్య చేసిన ఘటన కేసు ఆగస్టు 4కి వాయిదా పడింది. శ్రీకాకుళం కోర్టు జడ్జి లక్ష్మిపేట ప్రత్యేక కోర్టులో శుక్రవారం విచారణ చేపట్టి వాయిదా వేశారు. మొత్తం 80 మంది నిందితులకు గాను, 12 మంది చనిపోగా, ఇద్దరు నిందితులు గైర్హాజరయ్యారు. మిగతా 66 మంది హాజరయ్యారు. 2012 జూన్ 12న జరిగిన లక్ష్మిపేట మారణకాండ సంబంధించిన ఈ కేసు ఇక నుంచి ప్రతి వారం ప్రత్యేక కోర్టులో ప్రతి శుక్రవారం విచారణ జరిగే అవకాశం ఉందని, ఇలా జరిగితే సుమారు 6 నెల్లో ఈ కేసు పూర్తవుతుందని అంటున్నారు.

చిన్నారికి ఆర్థిక సాయం

రామభద్రపురం: మండల పరిధిలోని కోట సిర్లాం గ్రామానికి చెందిన దళాయి మౌళికి సిఎం సహాయ నిధి ద్వారా మంజూరైన సహాయాన్ని స్థానిక ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన్నప్పలనాయుడు చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌళి ఒకటిన్నర సంవత్సరాల నుంచి లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతూ శస్త్ర చికిత్స చేయించుకున్నప్పటికీ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండటంతో తన దృష్టికి తమ కార్యకర్తలు సమస్యను తీసుకొచ్చారన్నారు. దీంతో ప్రత్యేక చొరవ తీసుకుని సిఎం సహాయ నిధి ద్వారా సుమారు రూ.13లక్షలు మంజూరు చేయించడం జరిగిందన్నారు. కోట శిర్లాం గ్రామంలో ఆ అబ్బాయిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితి పై తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు, జెడ్‌పిటిసి అప్పికొండ సరస్వతి, సర్పంచ్ తాడ్డి శ్రీనివాసరావు, వైసిపి నాయకులు మీసాల రామారావు, బప్పలా చిన్నం నాయుడు, తెడు, పాల్గొన్నారు.

సురక్షతో సత్వర సేవలు

వంగర: సురక్ష కార్యక్రమంతో ప్రజలకు సత్వర సేవలు అందాయని ఎంపిపి ఉత్తరావల్లి సురేష్ ముఖర్జీ అన్నారు. మండల కేంద్రంలో సర్పంచ్ కనకల భారతి అధ్యక్షతన శుక్రవారం జరిగిన సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని పలువురు లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపితో అవినీతి రహిత పాలన సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి కిమిడి ఉమామహేశ్వరరావు, ఎంపిడిఒ వెలమల శ్రీనివాసరావు, డిటి సుందరరావు, కనగల పారినాయుడు, బొత్సల వెంకట అప్పలనాయుడు, దేవకివాడ దుర్గా అప్పలనాయుడు, కనగల పద్మ, ఏనుగు తల వెంకట నాయుడు, కిమిడి సన్యాసినాయుడు, వివిధ గ్రామాల సర్పంచులు ఎంపిటిసిలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేన్సర్ రోగికి నిత్యావసరాలు పంపిణీ

బొబ్బిలి రూరల్: మండలంలోని బూర్జవలస గ్రామానికి చెందిన కేన్సర్ రోగి గాడేల మున్నమ్మకు బొబ్బిలి రోటరీ క్లబ్ అధ్యక్షులు జెసి రాజు చిన్న కుమారుడు జెసిఎస్ రాయ్ వర్థంతి సందర్భంగా పురస్కరించుకుని రూ. 5వేల ఆర్థిక సాయం, నిత్యావసరాలను అందించారు. శుక్రవారం బూర్జవలసలో మున్నమ్మ గృహం వద్ద ఆమె కుమారుడికి ఈ మొత్తాన్ని అందించారు. ఆమె గత కొంత కాలం నుండి గర్భాశయ కేన్సర్‌తో బాధపడుతూ మహాత్మా గాంధీ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో కుటుంబం పోషణ కష్టంగా ఉండటంతో చేయూతనందివ్వాలని రోటరీ క్లబ్ వారిని అభ్యర్థించారు. వెంటనే అధ్యక్షులు జెసి రాజు స్పందించి సాయం చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సెక్రటరీ శ్రీహరి, రీజినల్ చైర్ చంద్ర కిషోర్, కోశాధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా టిడిపి ఓటర్ల తనిఖీ

నెల్లిమర్ల: టిడిపి నాయకులు శుక్రవారం ఇంటింటా ఓటర్ల తనిఖీ కార్యక్రమాన్ని చేపట్టారు. కొత్తపేట, గొర్లిపేటలో టిడిపి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి గేదెల రాజారావు ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికి వెళ్లి ఓటర్ల తనిఖీ నిర్వహించారు. గరికిపేటలో మాజీ సర్పంచ్ చింతపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో బిఎల్ఒ బెల్లాన బంగారు నాయుడు ఇంటింటికి వెళ్లి ఓటర్ల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్లస్టర్ పరిధిలో కొత్త ఓట్లు నమోదు, చనిపోయిన వారిని తొలగించడం, డోర్ నెంబర్ లేని ఓటర్ల వివరాలు సేకరణ వంటి చర్యలు చేపట్టారు. ఈ తనిఖీలో యూనిట్ ఇంచార్జి తాడ్డి సత్యనారాయణ, నాయకులు గొర్లె జనార్ధన, పిన్నింటి పాపు నాయుడు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సేవలను వినియోగించుకోండి

శృంగవరపుకోట: ప్రజలు ఆర్‌టిసి సేవలను వినియోగించుకోవాలని జోన్ 1 డిప్యూటీ చీఫ్ మేనేజర్ బి. అప్పలనాయుడు అన్నారు. శుక్రవారం ఆయన తన సిబ్బందితో పట్టణంలోని ఆర్‌టిసి డిపోను వచ్చి అన్ని సెక్షన్లు, బస్టాండ్, పార్సెల్ కౌంటర్ తనిఖీ చేసి డిపో సిబ్బందికి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. బస్టాండ్‌లో ప్రయాణికులతో మాట్లాడి ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఆర్‌టిసి సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ కె. రమేష్, సూపర్‌వైజర్లు, గ్యారేజ్, సెక్యూరిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రోటోకాల్‌ను విస్మరించిన అధికారులు

మెంటాడ: మండలంలోని శుక్రవారం పెదమేడపల్లి గ్రామ సచివాలయం ప్రాంగణంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మండల అధికారుల ప్రోటోకాల్ విస్మరించారని ఎంపిటిసి రెడ్డి ఎర్రినాయుడు అన్నారు. రాజకీయాలకు అతీతంగా ఒక మతాలకు సంబంధం లేకుండా అందరికీ సంక్షేమ పథకాలు అందేలా రూపొందించిన ఈ కార్యక్రమంలో లోకల్ ఎంపిటిసిని ఆహ్వానించపోవడం రాజకీయ దురుద్దేశాన్ని తెలుపుతుందన్నారు. ప్రభుత్వ అధికారులు ఈ విధంగా ప్రవర్తించడం తనను అవమానపరచడమేనన్నారు. తనకు జరిగిన అవమానాన్ని సోమవారం జిల్లా కలెక్టరుకు గ్రీవెన్స్ ద్వారా ఫిర్యాదు చేస్తానన్నారు.

ధర్మవరంలో డెంగీ కలకలం

- పారిశుధ్య నిర్వహణ లోపమే కారణం
- ప్రజారోగ్యంతో పంచాయతీ అధికారుల చెలగాటం
- మురికి కూపంలా ధర్మవరం గ్రామం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

వర్షాకాలం మొదలైంది. ప్రతిరోజు వర్షాలు కురుస్తున్నాయి. దీంతో సీజనల్ వ్యాధులు ప్రబలి ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. వర్షాలు కురిసినప్పుడల్లా ధర్మవరం మేజర్ పంచాయతీలోని ఎస్‌సి కాలనీ, ఎరుకల పేట పరిసరాలు చిత్తడిగా మారుతున్నాయి. మురుగు నీరు నిల్వ కారణంగా ఈగలు, దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో స్థానిక ప్రజలు డెంగీ బారిన పడుతున్నారు. ఇంత జరుగుతున్నా పారిశుధ్యం మెరుగుపర్చడంలో పంచాయతీ సిబ్బంది పూర్తిగా విఫలమవుతున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంతో కానీకి చెందిన ఒక వ్యక్తి డెంగీకి గురయ్యాడు. ఈ విషయమే ఇంఛార్జి ఈవో ఎంవి రంగారావుని రోగి ఇంటి వద్ద నుండి ప్రజాశక్తి వివరణ కోరగా తాను విషయం తెలిసిన వెంటనే రోగి ఇంటి వద్దకు చేరుకొని పరిసరాలను పరిశుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించి ఫాగింగ్ చేయించానని బుకాయించడం కొసమెరుపు..

మండలంలోని రెండవ మేజర్ పంచాయతీ ధర్మవరం గ్రామంలో ఎస్‌సి కాలనీలో డి.సన్యాసిరావు అనే వ్యక్తి అనారోగ్యానికి గురి కావడంతో అతనిని కుటుంబ సభ్యులు విజయనగరం సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు అతనికి వైద్య పరీక్షలు నిర్వహించి డెంగీ పాజిటివ్‌గా నిర్ధారించి ఆ సమాచారాన్ని మండలంలోని కొట్టం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులకు తెలియపరిచారు. వారు వెంటనే స్పందించి సన్యాసిరావు ఇంటికి చేరుకొని ఇంటి చుట్టు పరిసర ప్రాంతాల్లో ఉన్న నిలువనీటిని తొలగించి ఇంట్లోనూ ఇంటి చుట్టూ యాంటీ లార్వాలను పిచికారి చేసి డెంగీ ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వెంటనే పరిసరాలను శుభ్రపరిచి, బ్లీచింగ్ చల్లించి మురుగు కాలువలను శుభ్రం చేయించవలసిన పంచాయతీ సిబ్బంది ఎవరు అక్కడికి చేరుకోలేదు. కనీసం బాధితుని ఇంటి పరిసరాలను కూడా శుభ్రం చేయడం గాని బ్లీచింగ్, సున్నం వంటి జరగటం గానీ ఫాగింగ్ మిషన్ కానీ ఉపయోగించకుండా వర్షాకాలం ఈగలు, దోమలు పెరిగి సీజనల్ వ్యాధులు ప్రభలే కాలంలో కూడా పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంపై స్థానికులు మండిపడుతున్నారు. ప్రాణాలు పోతే గాని మురుగు శుభ్రపరచరా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామంలో పేరుకుపోయిన మురుగు

అధికారుల నిర్లక్ష్యమే కారణం..

పేరుకే మేజర్ పంచాయితీ పారిశుధ్య నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం పూర్తిగా కనిపిస్తోంది. ధర్మవరం గ్రామంలో ఎరుకల పేట, ఎస్‌సి కాలనీలో పారిశుధ్యం పరిస్థితి మరీ ధీనంగా ఉంది. నెలకొక్కసారైనా అధికారులు ఇక్కడ పారిశుధ్య నిర్వహణ పనులు చేయించడం లేదంటే ఈ పంచాయతీలో అధికారులు విధులు నిర్వహణ ఏ స్థాయిలో ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చును. ఇప్పటివరకు ఉన్న పంచాయితీ కార్యనిర్వాహణాధికారి బదిలీపై వెళ్లడంతో తిమిడి సెక్రెటరీని ఇంఛార్జిగా నియమించారు. ఆయన రెండు పంచాయితీలలో విధులు నిర్వర్తించలేనని మండల అధికారులకు తెలిపినట్లు సమాచారం. ఇకనైనా గ్రామ సర్పంచ్, పంచాయతీ అధికారులు స్పందించి ఎరుకలపేట, ఎస్‌సి కాలనీలో పారిశుధ్య నిర్వహణ జరిపి దోమలు ప్రబలకుండా, ప్రజలు డెంగీ బారిన పడకుండా చర్యలు తీసుకోవాలి. లేకుంటే ఈ పంచాయతీపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం. **- మద్దిల రమణ, సిపిఎం మండల కార్యదర్శి**

అభివృద్ధి చూసి మరోసారి ఆదరించండి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

వైసిపి పాలనలో జరుగుతున్న అభివృద్ధి చూసి మరోసారి ఆదరించాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పి సురేశ్ బాబు కోరారు. శుక్రవారం సతివాడలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రామంలో పర్యటించి సంక్షేమ పథకాలు అమలు, గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులు స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ వైసిపి పాలనలో సంక్షేమ పథకాలు పార్టీలకతతంగా అన్ని వర్గాల ప్రజలకూ అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అంబళ్ళ సుధారాణి, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యులు అంబళ్ళ శ్రీ రాములు నాయుడు, డిసిసిబి వైస్ ఛైర్మన్ చనమళ్ల వెంకట రమణ, జెడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాస రావు, వైస్ ఎంపిపి సారికి వైకుంఠం నాయుడు, సర్పంచ్ రేవళ్ళ శ్రీనివాసరావు, ఎంపిటిసి రెడ్డి సత్య నారాయణ, తహశీల్దార్ కె.వి.రమణ రాజు, ఎంపిడిఒ జి. గిరిబాల, ఇఒపిఆర్‌డి హెచ్ భానోజీరావు తదితరులు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని పాత సింగరాయి, కొత్త సింగరాయి, జగ్గయ్యపేట గ్రామాలలో గడపకు గడపకు జగనన్న కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఈ రెండు గ్రామాలలో పర్యటించి జగనన్న ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు పొందిన వారి వద్దకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇన్ని పథకాలు అందిస్తున్న జగన్మోహన్‌రెడ్డిని మరోసారి సిఎంను చేయాలని కోరారు. సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు నిరుజోగి వెంకటరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిటిసి రాయవరపు రాజేష్, పంచాయతీ కార్యదర్శి కన్నంనాయుడు, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు. జగ్గయ్యపేటలో జరిగిన గడపగడపకు కార్యక్రమంలో సర్పంచ్ వంటాకు రాములమ్మ, ఉప సర్పంచ్ వంటాకు శ్రీను ఎంపిటిసి సన్యాసిరావు, బుద్ధ అప్పలనాయుడు, వైసిపి మండల అధ్యక్షులు ముమ్ములూరి జగన్నాథం పాల్గొన్నారు.

బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

టిడిపి నిరసనతో పాలకుల్లో చలనం

టిడిపి ఇంఛార్జి బేబినాయన

ప్రజాశక్తి- బొబ్బిలి

పూల్ బాగ్ రహదారిపై టిడిపి నిరసనతోనే వైసిపి పాలకుల్లో చలనం వచ్చిందని బొబ్బిలి నియోజకవర్గ టిడిపి ఇంచార్జి బేబినాయన అన్నారు. కోటలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పూల్‌బాగ్ రోడ్డు బాగు చేయాలని టిడిపి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేస్తే రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తామని చెప్పిన ఎమ్మెల్యే ఇప్పటి వరకు పనులు ప్రారంభించకుండా ఈనెలాఖరున కౌన్సిల్ సమావేశంలో రూ.40లక్షలు నిధులు కేటాయిస్తూ తీర్మానం చేస్తున్నారన్నారు. టిడిపి నిరసనతోనే ఎమ్మెల్యే, అధికారులలో చలనం వచ్చిందని చెప్పారు. పట్టణానికి ముఖ్యమైన రహదారి పాడైపోవడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాలకులకు జ్ఞానోదయం కలిగించేందుకు నిరసన చేపడితే ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అవాకులు చవాకులు పేలడం సరికాదన్నారు. నిధులు మంజూరయ్యాయని, మంత్రాలకు చింతకాయలు రాలవని చెప్పిన ఎమ్మెల్యే ప్రభుత్వం నుంచి నిధులు తెప్పించకుండా మున్సిపల్ సాధారణ నిధులు కేటాయించడం చూస్తే ప్రభుత్వం దగ్గర ఎమ్మెల్యేకు ఉన్న గౌరవం ఎంతో అర్థం చేసుకోవచ్చునని ఎద్దేవా చేశారు. రోడ్డు ఎన్నికల ముందు జ్ఞాపకం వచ్చిందా అని ప్రశ్నించారు. సొంత పార్టీలోనే గౌరవం లేని వారికి సమాధానం చెప్పాల్సిన అవసరం లేదన్నారు. గొల్లపల్లి దాడితల్లి అమ్మవారి పండుగ సందర్భంగా బుగ్గిపోసి నిధులను దుర్వినియోగం చేస్తారా అని ప్రశ్నించారు. టిడిపిలో చేరికలతో వైసిపి నేతలను ఉక్కిరిబిక్కిరి చేస్తామన్నారు. అభివృద్ధిపై ప్రజలను మభ్యపెడుతున్నారని రాజకీయ అవసరాలకు ప్రజలను ప్రలోభాలకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో వైసిపికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఆయనతో టిడిపి పట్టణ అధ్యక్షులు రాంబార్కి శరత్, సీనియర్ నాయకులు రౌతు రామమూర్తి, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు ఉన్నారు.

సరసనాపల్లిలో ఏనుగులు హల్ చల్..

- భయందోళనలో ప్రజలు
- గ్రామంలో 144 సెక్షన్

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని సరసనాపల్లి గ్రామం పైలవారి తోటలో ఏనుగులు శుక్రవారం తిష్ట వేశాయి. ఏనుగులు హల్ చల్ చేయడంతో ప్రజలు భయ భ్రాంతులకు గురవుతున్నారు.. గ్రామంలో 144 సెక్షన్ విధించినట్లు తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తి తెలిపారు. గత వారం రోజుల నుంచి వంగర మండలం పలు గ్రామాల్లో ఏనుగులు సంచరించి గురువారం రాత్రే రేగిడి మండలంలోకి ప్రవేశించినట్లు అధికారులు చెబుతున్నారు. 8 ఏనుగులు గుంపులు, గుంపులుగా వచ్చి పంటలు నాశనం చేస్తున్నాయి. ఆయా గ్రామాల సమీపంలో తోటల్లో ఉన్న షెడ్లను, పూరి పాకలను ధ్వంసం చేస్తున్నాయి. దీంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఏనుగులతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రజలు భయపడుతున్నారు. ఏనుగులు హల్ చల్ విషయాన్ని ఆర్‌డిఒ అప్పారావు తెలుసుకొని తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తికి నరసనాపల్లి గ్రామతో పాటు పరిసర గ్రామాల ప్రజలను అప్రమత్తం చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో తహశీల్దార్, స్థానిక ఎస్ఐ శ్రీనివాసరావుకు సమాచారం అందించి రెవెన్యూ, పోలీస్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. గ్రామాల్లో విఆర్ఒ, విఆర్ఎలను అప్రమత్తం చేసి గ్రామాల్లో టామ్ టామ్ వేయించి అవగాహన కల్పించాలని సూచించారు. ఇంటి నుంచి బయటకు రావద్దని ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. ఏనుగులు కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని గ్రామస్థాయి అధికారులకు సూచించారు. ఏనుగులు మండలం దాటినంతవరకు ప్రయాణాలు చేయవద్దని కోరారు.

సైకిల్ యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- గరివిడి

ఎస్ఎఫ్ఐ జిల్లా వ్యాప్తంగా నిర్వహించబోతున్న విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర పోసర్‌ను స్థానిక ఆదర్శ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు వంశీ మాట్లాడుతూ జిల్లాలో విద్యారంగ అభివృద్ధి ధ్యేయంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న సంక్షేమ హాస్టల్స్‌ని, ప్రభుత్వ విద్యాలయాలని సందర్శిస్తూ 400 కిలోమీటర్ల విద్యార్థి సంగ్రామ యాత్ర ఈనెల 31వ తారీకున కొత్తవలసలో ప్రారంభిస్తామన్నారు. ఈ యాత్ర కొత్తవలసలో బయలుదేరి జిల్లా వ్యాప్తంగా వేలాదిమంది విద్యార్థులను కలుస్తూ ఆగస్టు 9వ తారీఖున జిల్లా కేంద్రంలో ముగుస్తుందని తెలిపారు. జిల్లాలో పేరుకుపోయిన విద్యారంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా జరిగే ఈ 400 కిలోమీటర్ల విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్రను జిల్లాలో ఉన్న ప్రజానీకం, విద్యార్థి లోకం, మేధావులు, యువజనులు జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు సాయి కిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

బొబ్బిలి: విద్యారంగం అభివృద్ధి కోసం చేపట్టనున్న ఎస్ఎఫ్ఐ సంగ్రామ సైకిల్ యాత్రను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు శుక్రవారం బొబ్బిలిలో గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా డివిజన్ కార్యదర్శి హరికృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేయాలన్నారు. ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలని, నూతన విద్యావిధానాన్ని రద్దుచేసి విద్యార్థులకు న్యాయం చేయాలని తదితర సమస్యల పరిష్కారం కోసం 400 కిలోమీటర్ల సైకిల్ యాత్రను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధయక్ష కార్యదర్శులు శివ, మణి కుమార్, మండల నాయకులు దావీదు, తేజ, విధ్యార్థులు పాల్గొన్నారు.

భరత్ జన్మదిన వేడుకలకు భారీ సన్నాహాలు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

టిడిపి విశాఖపట్నం పార్లమెంటరీ ఇంచార్జ్ ఎం. భరత్ జన్మదిన వేడుకలకు భారీ సన్నాహాలు చేస్తున్నట్లు టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. భరత్ పుట్టినరోజు సందర్భంగా శనివారం కొత్తవలసలోని గొరపల్లి రాము ఆఫీసులో తన ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిపి కేక్ కట్ చేస్తామన్నారు. అనంతరం కొత్తవలస నుండి బయలుదేరి విశాఖపట్నం వెళ్లి అక్కడ భరత్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి మరల కొత్తవలస వచ్చి మధ్యాహ్నం 12 గంటలకి కొత్తవలస శ్రీ చైతన్య మానసిక వికలాంగుల పాఠశాలలో మధ్యాహ్నం పిల్లలందరికి భోజనాలు పెడతామన్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకి బలిఘట్టం దగ్గర ఉన్న న్యూ హోప్ పాఠశాలలో పిల్లలకు భోజనాలు పెడతామన్నారు. ఈ వేడుకల్లో నియోజకవర్గంలోని ఐదు మండలాల టిడిపి కార్యకర్తలు, పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

జోగి రమేష్ వ్యాఖ్యలపై ఖండన

మంత్రి జోగి రమేష్ చంద్రబాబునాయుడు, లోకేష్‌లపై చేసిన అనుచిత వ్యాఖ్యలను టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ ఖండించారు. ఇటీవల గుంటూరు జిల్లా వెంకటపాలెంలో జరిగిన ఇళ్ల నిర్మాణ పత్రాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి జోగి రమేశ్ చంద్రబాబు, లోకేశ్ పై అనుచిత వ్యాఖ్యలు చేశారని వారిని విమర్శించే అర్హత జోగి రమేష్‌కు లేదని అన్నారు. బహిరంగ సభలో చంద్రబాబుని మంత్రి జోగి రమేశ్ అసభ్యకర విమర్శలు చేస్తుంటే అడ్డుకోవాల్సిన సిఎం వైఎస్ జగన్ సమర్థించేలా వ్యవహరించడం సిగ్గుచేటని అని అన్నారు.

అన్నా క్యాంటీన్‌కు స్థల పరిశీలన

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసేందుకు నియోజకవర్గ టిడిపి ఇంఛార్జ్, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్ శుక్రవారం పట్టణంలోని స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద, రోజువారీ శ్రామిక, కర్షక పనివారి దృష్టిలో పెట్టుకొని ప్రతిష్ఠాత్మకంగా ఎన్‌టిఆర్ అన్న క్యాంటిన్‌ను మరల త్వరలో మండల కేంద్రంలో మాజీ మంత్రి కీర్తి శేషులు కోళ్ల అప్పలనాయుడు జ్ఞాపకార్థం ప్రారంభిస్తున్నామన్నారు. దీని కోసం మండల కేంద్రంలో తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న స్థలాన్ని పరిశీలించామన్నారు. పేదవారి ఆకలి తీర్చడం కోసం త్వరలో అన్న క్యాంటిన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు కోళ్ల దంపతులు వెల్లడించారు. గతంలో చంద్రబాబునాయుడు పెట్టిన అన్నా క్యాంటీన్‌లను ఆదర్శంగా తీసుకుని తమ సొంత ఖర్చుతో పెట్టేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. వీరితో పాటుగా పరిశీలనలో పార్టీ మండల అధ్యక్షులు జిఎస్‌నాయుడు, పట్టణ ఉపాధ్యక్షులు పొట్నూరు అప్పలరాజు (సాయిరాం), మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న, రాష్ట్ర ఐటిడిపి కార్యదర్శి చెక్కా కిరణ్ కుమార్, టిడిపి విశాఖ పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శులు కాపుగంటి శ్రీనివాసు, విరోతి శివాజీ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజేష్ బాబు దాతృత్వం

ప్రజాశక్తి-విజయనగరంకోట

జొన్నవలస ఎంపిటిసి సభ్యులు, టిడిపి విజయనగరం నియోజకవర్గం కార్యాలయ కార్యదర్శి వర్మ రాజు (రాజేష్ బాబు) దాతృత్వాన్ని మరోమారు చాటుకున్నారు. ఇటీవల కేన్సర్‌తో చనిపోయిన 12వ డివిజన్ కు చెందిన కొయ్యల చిరంజీవి ఇద్దరి పిల్లలను మాన్సాస్ హైస్కూల్‌లో చేర్పించి చదువు నిమిత్తం రూ.రూ.30,200 ఆర్థిక సహాయాన్ని పార్టీ నాయకులు పూసపాటి అశోక్ గజపతి రాజు చేతులమీదుగా అశోక్ బంగ్లాలో శుక్రవారం అందజేశారు. వీరికి గతంలో విజయనగరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ తరపున సుమారు రూ.90 వేలు ఆర్థిక సాయాన్ని నాయకులు అందజేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, కార్యదర్శి బంగారు బాబు, మండల అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయాన్ని అందిస్తున్న అశోక్ గజపతిరాజు

ఆనాథశ్రమానికి సామాగ్రి అందజేత

విశాఖపట్నం జిల్లా భీమిలి మండలం తాళ్లపాలెం వద్ద అనాధ పిల్లలకోసం 'భరోసా లిటిల్ హగ్స్' పేరుతో అనాధ ఆశ్రమాన్ని నూతనంగా ఏర్పాటు చేసారు. ఆ సంస్థకు 46వ డివిజన్ మాజీ కౌన్సిలర్ కోండ్రు శ్రీనివాసరావు, పట్టణ పార్టీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ప్రసాదుల లక్ష్మి వరప్రసాద్, ఆల్తి బంగారుబాబు సౌజన్యంతో భోజనాలకు ఉపయోగపడే స్టీల్ సామాగ్రిని అందజేశారు.

ఈ కార్యదర్శి మాకొద్దు..

- జగనన్న సురక్షలో గ్రామస్తుల ఫిర్యాదు
- కార్యదర్శికి మెమో జారీ

ప్రజాశక్తి- డెంకాడ

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజల వద్దకే పాలను తీసుకువచ్చి ప్రజలకు సేవ చేయాలని ముఖ్య ఉద్దేశంతో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి పదిమంది వరకు ఉద్యోగస్తులు నియమించి గ్రామాల అభివృద్ధి కోసం ప్రయత్నిస్తుంటే కొంతమంది ఉద్యోగస్తులు ఆ నిర్ణయాన్ని నీరు కారుస్తున్నారు. మండలంలోని సింగవరం సచివాలయ కార్యదర్శి వసుంధరా దేవి పై సచివాలయం పరిధిలో ఉన్న నాతవలస, సింగవరం గ్రామాల ప్రజలు గురువారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో అధికారులకు ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యదర్శి ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని, తమకు వద్దని, గ్రామంలో పారిశుధ్య ఎక్కడికక్కడ తిష్టవేసి ఉంటుందని, వీధిలైట్లు వేయడం లేదని, సచివాలయ పరిధిలో ఉన్న గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదని, ఎవరు మాట వినటం లేదని, తనకు నచ్చిన రీతిలో పనిచేస్తుందని ఆరోపించారు. ఈ విషయంపై ఎంపిడిఒకు కూడా గతంలో ఫిర్యాదు చేశామని అయినా ఆమెలో ఎటువంటి మార్పు రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏ విషయం అడిగినా తనకు నచ్చినట్లు చేస్తుందని, ఎందుకు ఇలా చేస్తున్నారని ప్రశ్నిస్తే నేను ఇలానే చేస్తాను. నేను ఎవరి మాట వినను, నేను మోనార్కును, నాకు ఎవరైనా ఒక్కటే, ఐ డోంట్ కేర్ అని సమాధానం చెబుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. రెండుసార్లు బదిలీలు కార్యక్రమం నిర్వహించారని అప్పుడు నన్ను బదిలీ చేయించకోవచ్చు కదా అని తిరిగి ప్రజలపై తిరగబడ్డం జరుగుతుందని ప్రజల ఆందోళన వ్యక్తం చేశారు. గ్రీన్ అంబాసిడర్‌కు తగిన సమయంలో వారికి జీతాలు ఇవ్వకపోవడం సరికదా వారిని దూషించడం కూడా జరుగుతుందన్నారు. దీంతో వారు గ్రామంలో నెలరోజుల పాటు పారిశుధ్యం నిర్వహించకుండా చెత్త బల్లలను సచివాలయం దగ్గర పెట్టి వెళ్లిపోయారన్నారు. ఈ విధంగా కార్యదర్శి వసుంధరా దేవి చేయడంతో సచివాలయ సిబ్బంది కూడా అలాగే ప్రవర్తిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. అధికారులు ప్రజాప్రతినిధులు గ్రహించి ఈ కార్యదర్శినీ మార్చి వేరొక కార్యదర్శిని సచివాలయానికి వేయాలని సచివాలయ పరిధిలో ఉన్న గ్రామస్తులు కోరారు.



ఎంపిడిఒ ఇచ్చిన మెమో కాపీ

కార్యదర్శికి మెమో జారీ

జగనన్న సురక్ష కార్యక్రమంలో కార్యదర్శి వసుంధరా దేవి పై ఫిర్యాదు రావడంతో మెమో జారీ చేశామని ఎంపిడిఒ డిడి స్వరూప రాణి తెలిపారు. ఆమెపై గతంలో కూడా సచివాలయం నుంచి చాలా ఫిర్యాదులు వచ్చాయని పనితీరు మార్చుకోమని చెప్పిన పడచేవిని పెట్టడంతో ఈ చర్యలకు పూనుకున్నామని ఆమె శుక్రవారం స్పష్టం చేశారు.

ప్రజా ప్రతినిధులు కాని వారిదే హవా!

ప్రజాశక్తి - వేపాడ

స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి డి సత్యవంతుడు అధ్యక్షతన శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు కానివారి హవా కొనసాగింది. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు పాల్గొన్న ఈ సమావేశం ప్రారంభంలోనే ప్రజా ప్రతినిధులు కాని వారు ప్రశ్నలు వేయడం ఆ ప్రశ్నలకు కొంతమంది అధికారులు సమాధానం చెప్పడం పట్ల సర్వత్రా చర్చ జరిగింది. కేవలం ఎంపిడిఒ ప్రేక్షక పాత్ర వహించడంతో మరింత రెచ్చిపోయిన చోటా నాయకులు పలు ప్రశ్నలు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడుతూ సచివాలయం సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వానికి మంచి పేరు తేవాలన్నారు. అరిగిపాలెం ఎంపిటిసి పివి రమణ, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు సింగరాయ నుండి చందులూరి వరకు రోడ్డుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ముకుందపురం, బాణాది, చిన్న గుడిపాల గ్రామ సర్పంచులు గ్రామ సమస్యలను వివరించారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు, డి ముత్యాలమ్మ, తహశీల్దార్ ప్రసన్న కుమార్, వియ్యం పేట ఐసిడిఎస్ పిఒ, మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంలో వరి నాట్లు

గరివిడి : మండలంలోని గెడ్డపువలసలో ప్రకృతి వ్యసాయ పద్ధతిలో శుక్రవారం వరినాట్లు వేశారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తుమ్మగంటి సుశీల మాట్లాడుతూ వరస క్రమంలో వరి నాట్లు వేసుకోవడం వల్ల పంటకు గాలి వెలుతురు బాగా తగిలి సూర్య రశ్మి కూడా పంటకు తగిలి దుబ్బు బాగా చేస్తుందన్నారు. దోమపోటు కూడా రాదని తెలిపారు. రైతులు రౌతు సూర్యనారాయణ, గెడ్డపు ఆదినారాయణ పొలాల్లో వరి బీజామృతంతో నారు శుద్ధి చేసి లైన్ సోయింగ్ వేశామన్నారు.

గెడ్డలో విద్యార్థి గల్లంతు

ప్రజాశక్తి- నెల్లిమర్ల

నెల్లిమర్ల మండలంలోని పిన తరిమి గ్రామంలో శుక్రవారం విషాద ఛాయలు ఆలముకున్నాయి. శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండల పరిధిలో ఉన్న దేవుని పాలవలస చిట్ట గెడ్డకు సరదాగా ఈత కోసం వెళ్లి నెల్లిమర్ల మండలం తరిమి గ్రామానికి చెందిన లోకేష్ అనే తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థి గల్లంతయ్యాడు. చీకటి పడిన వరుకు గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో తల్లి దండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

చెరువులో పడి ట్రాక్టర్ డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని కంటకాపల్లి వద్ద గల గనిలో పడి ట్రాక్టర్ డ్రైవర్ ఉల్లి నాగరాజు (56) మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. నాగరాజు గురువారం సాయంత్రం కిరాణా సామాన్లు కొనుగోలు నిమిత్తం ఇంటి నుండి కొత్తూరు వెళ్లాడు. రాత్రి సమయమైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కలంతా వెతికారు. ఈ నేపథ్యంలో కంటకాపల్లి గ్రామానికి పక్కనే ఉన్న చెరువు దగ్గర అతని చెప్పులు కనిపించాయి. అనుమానం వచ్చి చెరువులో దిగి వెతికారు. కానీ అతని ఆచూకీ లభ్యం కాలేదు. శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులు చెరువు వద్దకు వెళ్లి చూసేసరికి నీటిలో ఉల్లి నాగరాజు శవం తేలుతూ కనిపించింది. మృతుని భార్య ఉల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎస్.కోట తరలించారు.